# సింగిల్ పేజి కథలు

## పిగులు పిట్ట

మా గ్రామం కొండకోనల్లో విసిరివేయబడ్డట్టు ఉంటుంది. అందులోనూ మా ఇల్లు గ్రామానికి ఇంకా దూరంగా అడవి దాపున ఉంది. చుట్టూ అడవిమధ్యలో ఇల్లు, ఇంటి చుట్టూ చేలు, కొర్ర చేను, సామ చేను, జొన్న చేను, గంటి చేను. బెంగ, వంగ, మిరప వంటి కూరగాయల మొక్కలతో 'గిరిజన వ్యవసాయం గొర్రెకు బెత్తుడు తోక' సామెతన సాగుతూ ఉంటుంది.

నా బాల్యంలో తొలి సగమంతా దాదాపు అక్కడున్న పక్షులు, జంతువులు, క్రిమికీటకాదుల మధ్యనే జరిగింది. పలక, పుస్తకాలు పట్టుకునే వయసులో కూడా పక్షులు, జంతువులు నన్నొదల్లేదు. అమ్మ, నాన్న, అన్నయ్య వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు నేను ఆడుకోవడానికి సీతాకోక చిలుకలు, రంగు రంగుల కీటకాలు, తూనీగలు, కుందేళ్ళు, పిట్టలు ప్రాణస్నేహితులుగా ఉండేవి. నేను ఏడు సంవత్సరాల బాల్యంలో ఉన్నప్పుడు ఒకరోజు ఇంటికి దగ్గర్లో అడవి సోమిత చెట్టుమీద కొమ్మల్లో 'పిగులు పిట్ట' గూడు కట్టుకుంటున్నట్టు చూసాను. ఎక్కడి నుండో చితుకులు, సన్ననిపుల్లలు, మెత్తని నార మొదలైన వాటిని తీసుకొచ్చి సుందరమైన గూడు కట్టింది. గూడుకట్టడంలో ఎంతో చాకచక్యతను పాటించింది. చితుకుల్ని, గట్టిపుల్లల్ని అడుగుభాగంలో పేర్చి, మెత్తని నారను లోపలివైపున పెట్టబోయే గుడ్లకు ఒత్తిడి లేకుండా పేర్చింది పిగులు పిట్ట. గూటిలో పిగులు పిట్ట ఎప్పుడు గుడ్లు పెడుతుందా, గుడ్లు ఎప్పుడు పిల్లలుగా మారుతాయా, అందులో ఒక పిల్లని ఎప్పుడు ఇంటికి తెచ్చుకుందామా అని ప్రతిరోజూ ఎదురుచూడసాగాను. ప్రతి రోజూ పిగులు పిట్ట పిల్లల ధ్యాసలోనే పడుకోవడం ఆ ధ్యాసలోనే నిద్రలేవడం జరిగేది. నిద్రలేచిందే తడవుగా పిగులు పిట్ట గూడుకట్టిన సోమిత చెట్టు దగ్గరకు కళ్ళు నలుపుకుంటూ పరుగెత్తేవాడిని.



నెమ్మదిగా చెట్టుపైకి ఎగబ్రాకడం, గుడ్లు కదలకుండా గూటికి దగ్గరగా ముఖంగా పెట్టి చూసేవాడిని. గోళీకాయల వంటి తెలుపురంగు గుడ్లమీద కాఫీపొడి రంగు చుక్కలతో చాలా ముచ్చట గొల్పుతుండేవి. వాటిని చేత్తో పట్టుకొని పరిశీలనగా చూడాలనుకొనేవాడిని. కాని అమ్మ ఒకసారి చెప్పింది. పిట్టగూటిలో గుడ్లను ఎవరైనా ముట్టుకుంటే తల్లిపిట్ట అది తెలుసుకొని ఆ గుడ్లని మరొక చోటికి మార్చి వేస్తుందని. ఆ మాటలు గుర్తుకొచ్చి పిట్టగుడ్లను ముట్టుకోవాలనే కోరికను ఆపేసుకునేవాడిని.

పిగులు పిట్ట పొదగడం, పిల్లల్ని చేయడం, కొంచెం కొంచెంగా రెక్కలు తొడిగి రేపోమాపో ఎగిరిపోవడానికి సిద్ధపడేంతవరకు ఎదురుచూసాను. ఒకరోజు ఆ గూట్లోంచి ఒక పిగులు పిట్ట పిల్లని జాగ్రత్తగా పట్టుకొని ఇంటికి తీసుకొచ్చాను. మా అమ్మ నా చేతిలో రెక్కలు ముడుచుకొని ఒదిగిపోయి ఉన్న పిట్టపిల్లని చూసింది.

"దీనికి పూర్తిగా రెక్కలు కూడా రాలేదు. పాపం లేత పిట్టపిల్ల. దీన్నెందుకు తీసుకొచ్చావురా బాబూ, ఎల్లు దీన్ని తీసుకెళ్లి తల్లిపిట్ట దగ్గర వదిలేసిరా" అన్నది అమ్మ.

"ఉ...ఉ.." దీన్ని నేను పెంచుకుంటాను.

"తల్లిని పిల్లని విడదీత్తే పాపం తగులిద్దిరా తండ్రి" అమ్మ.

"ఉ...ఉ.."

"పాపం, అది చూడు చిన్నపిల్ల. చలికి ఎలా వణుకుతుందో..తల్లిరెక్కల కింద వెచ్చగా నిద్రపోయే పిల్లని తీసుకొచ్చావుగదరా"

"ఊ...ఉ..నేను పెంచుకుంటానమ్మా"

"ఆ చిన్నపిల్లకు పురుగుపుట్రా పట్టుకొచ్చి తల్లి పెంచుద్ది. దానికి ఆకలేత్తుందేమో మనకు తెలదు, దగాత్తందేమో తెలదు"

"గంటి గింజలు తినిపించనా? నీలు పట్టించనా?" ఏడుపు అందుకున్నాను. నా పట్టుదల గమనించిన అమ్మ గంటిగింజలు తీసుకొచ్చి పిట్టపిల్ల ముందు పోసింది. పిగులు పిట్ట గంటెలు తినలేదు. అమ్మ నా దగ్గరకొచ్చి, నా కంటినుండి కారుతున్న కన్నీటిని చేత్తోతుడిచి ప్రేమగా దగ్గరకు తీసుకొని "పిట్టపిల్ల తల్లి దగ్గరుండగా ఎగరడం నేర్చుకుంటది, మేత నోట్లో పెట్టి తినడం నేర్పుతాది తల్లి. దాన్ని తల్లి దగ్గర వదిలేసిరా బాబూ" అమ్మ మాటలకు నేను లొంగలేదు. పైగా అమ్మ చేతుల్లోంచి తప్పించుకొని ఏడుపు ఎక్కువ చేసాను. పిట్టపిల్లని తల్లి దగ్గర వదిలేసి రావడాన్కి నా మనస్సు కొద్దిగా కూడా అంగీకరించలేదు. అమ్మ నన్ను మళ్ళీ దగ్గరకు తీసుకొని పవిట చెంగుతో నా కళ్ళను తుడుస్తూ తలని మురుతూ ఇలా అన్నది అమ్మ- "నేను లేకుండా నువ్వు ఎలాగైతే ఉండలేవో, అలాగే తల్లిపిట్ట లేకుండా ఈ పిల్లపిట్ట కూడా ఉండలేదు. కన్నకడుపూ అలాంటిదే బాబూ" సృష్టిలో తల్లీ పిల్లల మధ్య సంబంధాన్ని ఒక్కవాక్యంలో ఏడు సంవత్సరాల నా బాల్యానికి కూడా అర్థమయ్యేలా చెప్పి అక్కడనుండి వెళ్లపోయింది అమ్మ. ఈసారి ఈ పిల్ల పిట్టని దాని తల్లి దగ్గర వదిలేస్తావో లేదో నీ దగ్గరే ఉంచుకుంటావో నీవే తేల్చుకో అన్నట్లుగా అన్పించింది నాకు.

మలిపొద్దు కొండల్లోకి ఎర్రగా జారిపోతుంది. నేను పిగులు పిట్ట పిట్టని చేత్తో పట్టుకొని అడవి సోమిత చెట్టువైపు బయల్దేరాను. ఆ చెట్టుమీద తల్లి పిట్ట ఈ కొమ్మకూ ఆ కొమ్మకూ ఎగురుతూ పిట్టకోసం అరుస్తుంది. నా చేతిలో ఉన్న పిగులు పిట్ట పిల్లను నెమ్మదిగా కొమ్మమీద ఉంచగానే రెక్కలాడిస్తూ తల్లిదగ్గరకు ఎగరబోయింది. ఎగరలేక క్రింది కొమ్మల మీదకి జారిపోతుంటే తల్లిపిట్ట ఎగురుతూ పిల్లకోసం దిగిరావడం చూసాను. వెనుదిరిగి అమ్మ మాటలు గుర్తుచేసుకుంటూ ఇంటికి వచ్చేసాను.

**-తమదాల శేషగిరి** (తుని)